## క్లుప్తంగా

### ఎంపీకి శుభాకాంక్షలు



పుష్పగుచ్ఛం అందిస్తున్న ఊట్ల వరప్రసాద్

**సుల్తానాబాద్:** ఇటీవల రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన ఎంపీ మందాడి అనిల్‌కుమార్‌యాదవ్‌ను పీసీసీ సభ్యులు, యూత్ కాంగ్రెస్ జాతీయ మాజీ కార్యదర్శి ఊట్ల వరప్రసాద్ ఆదివారం హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

### రూ.100కోట్ల నిధుల మంజూరుపై హర్షం

**యైటింక్లయిన్‌కాలనీ:** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.100కోట్ల నిధులు మంజూరు కావడంపై యైటింక్లయిన్‌కాలనీ కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నిధుల మంజూరుకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డికి, మంథని ఎమ్మెల్యే, మంత్రి శ్రీధర్‌బాబుకు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు ఆదివారం కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పెద్దపల్లి జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి, కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, కార్పొరేటర్ శంకర్‌నాయక్, నాయకులు తిరుపతిరెడ్డి, కిషన్ నాయక్, తిరుపతి, రాజు, రాములు, సారయ్యానాయక్, యాదగిరి తిరుపతి, అవినాష్ ఉన్నారు.

### నిరుపేదరాలికి ఆర్థికసాయం

**పాలకుర్తి:** మండలంలోని కుక్కలగూడుర్ గ్రామానికి చెందిన నిరుపేదరాలు కట్కూరి చంద్రమ్మకు ఆదివారం కన్నాల సింగిల్‌విండో చైర్మన్, కేశోరాం సిమెంట్ కంపెనీ పర్మినెంట్ యూనియన్ అధ్యక్షుడు బయ్యపు మనోహర్ రెడ్డి ఆర్థికసాయం అందించారు. చంద్రమ్మ నివాసముండే రేకులషెడ్డు కూలిపోయే పరిస్థితిలో ఉండడంతో విషయం తెలుసుకున్న మనోహర్‌రెడ్డి ఇంటి మరమ్మతు కోసం రూ.5వేలు అందజేశారు. శ్రీపతి సురేశ్, సతీశ్ ఉన్నారు.

### ఎస్సైకి సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

**జూలపల్లి:** మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చిన ఎస్సై శ్రీధర్‌ను తేలుకుంట గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సైని సన్మానించారు. మాజీ ఎంపీటీసీ కొంపెల్లి స్వామి, మంద లక్ష్మన్, రమేశ్, మేకల శ్రీకాంత్, జనప తిరుపతి, కనకం తిరుపతి, మారం మల్లేశం, తడకపెల్లి శంకర్, భూపెల్లి లక్ష్మన్ ఉన్నారు.

### బీజేపీ నేతకు నివాళి



**పెద్దపల్లి రూరల్:** పట్టణానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు ఠాకూర్ రాజారాం సింగ్ అకాల మరణం పొందడం దురదృష్టకరమని మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం రాజారాంసింగ్ భౌతికకాయం వద్ద పార్టీ నేతలు రాంసింగ్, రాజు, శ్రీనివాసరావు, సమ్మయ్య తదితరులతో కలిసి ఆయన నివాళి అర్పించారు.

### ఠాణాకు వాటర్ ప్యూరిఫైడ్ వితరణ



వాటర్ ప్యూరిఫైడ్ అందజేస్తున్న సమ్మయ్య

**పాలకుర్తి:** మండలంలోని బామ్లానాయక్‌తండా గ్రామపంచాయతీ పరిధి రాజీవ్‌తండాకు చెందిన ఇస్లావత్ సమ్మయ్యనాయక్ బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు ఆదివారం వాటర్ ప్యూరిఫైడ్ అందజేశారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు, స్థానిక సిబ్బందికి రక్షిత మంచినీటిని అందించేందుకు తన తండ్రి పాపయ్య నాయక్ స్మారకార్థం రూ.15వేల విలువ గల వ్యాటర్ ప్యూరిఫైడ్‌ను బసంత్‌నగర్ ఎస్సై స్వామికి అందజేశారు. ఈ సందర్భంగా సమ్మయ్యనాయక్‌ను ఎస్సై అభినందించారు.

# ఒంటికి, రెంటికి.. తిప్పలే

- మార్కెట్‌లో మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్న వ్యాపారులు
- రోడ్లపక్కనే మల, మూత్ర విసర్జన
- ఇబ్బంది పడుతున్న కాలనీవాసులు



గౌతమినగర్ కూరగాయల మార్కెట్

**ఫెర్టిలైజర్‌సిటీ:** రామగుండం కార్పొరేషన్ పరిధిలోని కూరగాయల మార్కెట్‌ల అభివృద్ధికి 2018లో సుమారు రూ.83లక్షల వ్యయంతో గౌతమినగర్, 8ఇంక్లైన్ కాలనీ, సీహెచ్‌పీ మార్కెట్ కేటాయించారు. కార్పొరేషన్ పరిధిలోని 39వ డివిజన్ గౌతమినగర్ కూరగాయల మార్కెట్ ప్రతి బుధవారం వినియోగదారులతో రద్దీగా ఉంటుంది. గౌతమినగర్ మార్కెట్ అభివృద్ధి కోసం రూ.30లక్షలు వెచ్చించి మార్కెట్‌ని అభివృద్ధి చేశారు. పది గ్రామాలకు ఇదే ప్రధాన మార్కెట్. సాయంత్రం సమయంలో వివిధ కాలనీలు, గ్రామాల నుంచి కూరగాయలు కొనేందుకు వినియోగదారులు రావడంతో మార్కెట్ మొత్తం రద్దీగా ఉంటుంది. మార్కెట్‌లో 200 మంది వ్యాపారులు కూరగాయలు, నిత్యావసర సరుకులు, పండ్ల వ్యాపారులు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విక్రయిస్తారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో మార్కెట్ నిర్మించిన అధికారులు వ్యాపారుల సౌకర్యం కోసం మరుగుదొడ్లు నిర్మించడంలో నిర్లక్ష్యం వహించారు. మార్కెట్‌లో వ్యాపారుల్లో అధికశాతం మహిళలు ఉన్నారు. మరుగుదొడ్లు లేక వారు తిప్పలు పడుతున్నారు.

**మరుగుదొడ్లు నిర్మించాలి**

రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గౌతమినగర్ మార్కెట్‌లో మరుగుదొడ్లు నిర్మించాలని వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు. మార్కెట్ పరిసరాలలో వ్యాపారులు రోడ్లపక్కనే మలమూత్ర విసర్జనకు వెళ్లడంతో ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. అధికారులు స్పందించి మరుగుదొడ్లు నిర్మించేలా చర్యలు చేపట్టాలని వ్యాపారులు, కాలనీవాసులు కోరుతున్నారు.

### అధికారులు స్పందించాలి



గౌతమినగర్ కూరగాయల మార్కెట్‌లో ప్రతి బుధవారం కూరగాయలు విక్రయిస్తాం. వ్యాపారం జరిగే సమయంలో మహిళలు సహజ కృత్యాలకు వెళ్లాలంటే ఇబ్బంది పడాల్సి వస్తుంది. అధికారులు స్పందించి మార్కెట్‌లో మరుగుదొడ్లు నిర్మించాలి.

– పిడుగు రాజమల్లు, కూరగాయల వ్యాపారి

### కాలనీవాసులకు ఇబ్బంది



కార్పొరేషన్ ఆధ్వర్యంలో గౌతమినగర్ మార్కెట్‌లో వ్యాపారుల సౌకర్యార్థం మరుగుదొడ్లు నిర్మించాలి. వ్యాపారులు గౌతమినగర్, శాంతినగర్‌కు వెళ్లే రహదారిలో సహజ కృత్యాలకు వెళ్లడంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– నల్లాల ప్రణీత్, శాంతినగర్

# మానేరులో ఇసుక తవ్వితే ఊరుకోవద్దు

- ఇసుక నిల్వల కోసం కాంట్రాక్టర్లకు భూములు లీజ్‌కు ఇవ్వొద్దు
- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

**ఓదెల:** మానేరు పరివాహక ప్రాంతంలో ఇసుక తవ్వితే ఊరుకోవద్దని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఆదివారం మండలంలోని గుండ్లపల్లెలో ఉపాధిహామీ పథకం కింద మంజూరైన రూ.10లక్షలతో సీసీరోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ మానేరు పరివాహక ప్రాంతాల్లో ఇసుక రవాణా గురించి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పర్మిషన్‌తో గడ్డకు పోసుకున్న ఇసుక రవాణా ఎప్పటిలాగే కొనసాగించాలి, కానీ ప్రస్తుతం ఎవరైనా మానేరులో ఇసుకను బయటకు తీస్తే అడ్డుకోవాలని సూచించారు. గుండ్లపల్లె, కనగర్తి, మడక, పొత్కపల్లి, గుంపుల గ్రామాల్లోని మానేరులో ఇసుక రవాణాతో భూగర్భజలాలు తగ్గుతున్నాయన్నారు. ఇసుక నిల్వల కోసం కాంట్రాక్టర్లకు భూములు లీజుకు ఇవ్వొద్దని కోరారు. మాజీ సర్పంచ్ పుప్పాల శంకర్, పొత్కపల్లి సింగిల్‌విండో మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పిట్టల రవికుమార్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్, మాజీ ఉపసర్పంచు శ్రీనివాస్, నాయకులు పెద్దిరెడ్డి గణపతిరెడ్డి, రాజ్‌కుమార్‌రెడ్డి, మల్లారెడ్డి, రాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, ముక్కీస దామోదర్‌రెడ్డి, మల్లారెడ్డి, పుచ్చకాయల వీరన్న, ఎక్కిరెడ్డి అనిల్ పాల్గొన్నారు.

## మంథని అభివృద్ధికి ఉదాహరణగా నిలుస్తుంది



మాట్లాడుతున్న నాయకులు

**మంథని:** మంథని నియోజకవర్గం రాబోయో రోజుల్లో అభివృద్ధికి ఉదాహరణగా నిలుస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అయిలి ప్రసాద్, ప్రచార కమిటీ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మంథని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్నిరోజుల్లోనే మంత్రి శ్రీధర్‌బాబు మంథనిలో అభివృద్ధికి బాటలు వేస్తున్నారన్నారు. గోదావరిపై వంతెన నిర్మాణానికి రూ.125కోట్లతో పాటు మంథనిలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి ప్రణాళికలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. జననేత శ్రీపాదరావు జయంతి అధికారికంగా నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. పట్టణశాఖ అధ్యక్షుడు పోలు శివ, మున్సిపల్ కౌన్సిలర్ పెండ్రు రమాదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శంకర్, నాయకులు ఎరుకల ప్రవీణ్, మంథని సత్యం, నూకల బానయ్య, కుడుదుల వెంకన్న, జనగామ నర్సింగారావు, కొత్త శ్రీనివాస్, ముస్కుల సురేందర్‌రెడ్డి ఉన్నారు.

## ప్రభుత్వ విప్ పరామర్శ



పరామర్శిస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

**ధర్మారం:** రోడ్డు ప్రమాదంలో గాయపడిన ధర్మారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్రగుంటపల్లికి చెందిన కొత్త నర్సింహులును ఆదివారం ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పరామర్శించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, పార్టీ నాయకులు లావుడ్య రూప్లానాయక్, కోమటిరెడ్డి దేవేందర్‌రెడ్డి, మణిశర్మ, సోగాల తిరుపతి పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



రోడ్డును ఆనుకుని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

**కాల్వశ్రీరాంపూర్:** కాల్వశ్రీరాంపూర్ నుంచి జమ్మికుంటకు వెళ్లే రహదారిలో ఇప్పలపల్లి సమీపంలో విద్యుత్ కంచె లేకుండా ఆర్‌అండ్‌బీ రహదారిని ఆనుకుని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. రోడ్డు వెడల్పు కార్యక్రమంలో రహదారి విస్తరించడంతో ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుపక్కనే ప్రమాదకరంగా మారింది. అనునిత్యం వ్యవసాయదారులు, రైతులు, కూలీలు, విద్యార్థులు, పశువులు, వేలాదిమంది ప్రయాణికులు వందలాది వాహనాలు ఇదే రహదారి నుంచి జమ్మికుంట, వరంగల్, హైదరాబాద్, మంథని, కాటారం, భూపాలపల్లి జిల్లా, గోదావరిఖని, మంచిర్యాల పారిశ్రామిక ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తూ ప్రయాణం చేస్తుంటారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరోచోటుకు తరలించాలని కోరుతున్నారు.

## ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

**సుల్తానాబాద్:** సుల్తానాబాద్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముత్యం సునీతను పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పరామర్శించారు. సునీత భర్త ముత్యం రమేశ్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఆదివారం పట్టణంలోని గౌడ వీధిలో నివాసముంటున్న సునీతను ఎమ్మెల్యే పరామర్శించారు. సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాహిరి మహేందర్, కుమార్ కిషోర్, మాజీ సర్పంచులు అంతటి అన్నయ్యగౌడ్, ప్రకాశ్‌రావు, మాజీ జెడ్పీటీసీ గోపగాని సారయ్య గౌడ్ తదితరులు ఉన్నారు.

## గర్రెపల్లి జాతర ఆదాయం రూ.4.50లక్షలు

**సుల్తానాబాద్‌రూరల్:** మండలం గర్రెపల్లిలోని సమ్మక్క–సారలమ్మ జాతరలో రూ.4.50లక్షల ఆదాయం వచ్చినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం కమిటీ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని చేపట్టగా హుండీ, కేశఖండనం, బహిరంగ వేలం రూపంలో ఆదాయం సమకూరినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కొమురవెల్లిలో మాజీ ఎమ్మెల్యే పూజలు



**పెద్దపల్లిరూరల్:** పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి కుటుంబీకులు ఆదివారం కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు.

# దేశాన్ని కాపాడుతున్న నాయకుడు మోదీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ గుప్తా

**ధర్మారం:** ఇతర దేశాల నుంచి ముప్పురాకుండా భారతదేశాన్ని కాపాడుతున్న ప్రధాని నరేంద్ర మోదీ అని నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ గుప్తా అన్నారు. విజయసంకల్ప యాత్రలో భాగంగా ఆదివారం ధర్మారం మండలానికి చేరుకున్న యాత్రకు పార్టీ మండల అధ్యక్షుడు గుజ్జుల వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కమ్మరిఖాన్‌పేట, బంజేరుపల్లి, కటికెనపల్లి మీదుగా ధర్మారం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ధర్మారం అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వహించిన రోడ్‌షోలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో సంక్షేమం, సంస్కరణలు మోదీ ప్రభుత్వంలోనే సాధ్యమైందన్నారు. కరోనా కష్టకాలంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అడ్రస్ లేకుండా పోతే ఉచితంగా మూడుసార్లు కరోనా వ్యాక్సిన్ వేసి ప్రజల ప్రాణాలను కాపాడిన ఘనత బీజేపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కాంగ్రెస్ ఆరు సూత్రాల అబద్ధాలతో అధికారంలోకి వచ్చిందని మాజీ ఎమ్మెల్యే బోడిగే శోభ ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్ రెడ్డి, నాయకులు ఎస్.కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాగిరెడ్డి మహిపాల్‌రెడ్డి, మెడవేని శ్రీనివాస్, సందనవేని లక్ష్మణ్, మణికంఠ, ఎల్లాల మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# 'పది'లో ఉత్తమ ఫలితాలే లక్ష్యం



పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ

- వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయుల దృష్టి
- మార్చి 18 నుంచి పరీక్షలు ప్రారంభం

**రామగుండం:** పదో తరగతి పరీక్షలు మార్చి 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో హైస్కూల్‌లో సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు రెండు విడతలుగా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. కాగా ఇప్పటికే సబ్జెక్టుల వారీగా తరగతుల నిర్వహణ, సమయం తదితర అంశాలపై విద్యాశాఖ హైస్కూళ్లకు గైడ్‌లైన్స్ పంపించడంతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పదో తరగతిలో వందశాతం ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక ఫోకస్ చేశారు. రామగుండం హైస్కూల్‌లో 69 మంది విద్యార్థులుండగా రెండు తరగతి గదుల్లో ప్రతిరోజు ఒక సబ్జెక్టుపై పరీక్షలో సమాధానం రాసే విధానంపై విద్యార్థులతో సాధన చేయిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం గం.8.30–9.30 వరకు, సాయంత్రం 4.45–5.45 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

## బీజేపీతోనే అన్నిరంగాల్లో అభివృద్ధి

**జూలపల్లి:** బీజేపీతోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ అన్నారు. మండలంలోని వెంకట్రావుపల్లె, కాచాపూర్, కుమ్మరికుంట, అబ్బాపూర్‌లో పార్టీ విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలపై మాట్లాడి వివరాలు సేకరించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రైతుల అభివృద్ధికి ప్రత్యేక మేనుఫెస్టో తయారు చేయనున్నట్లు వివరించారు. పీఎం మోదీ నాయకత్వంలో ప్రపంచ దేశాల్లో భారత్‌కు గౌరవం, గుర్తింపు తెచ్చిన ఘనత మోదీకే దక్కిందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీదే అధికారమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ జూలపల్లి మండల అధ్యక్షుడు కొప్పుల మహేశ్, ధర్మారం అధ్యక్షుడు, గుజ్జుల వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సునీల్ రెడ్డి, ఎస్.కుమార్ పాల్గొన్నారు.

## వైభవంగా సప్తప్రహరణ సంకీర్తన మహోత్సవాలు



హోమంలో పాల్గొన్న భక్తులు

**ఎలిగేడు:** మండల కేంద్రంలోని శ్రీకోదండ రామాలయంలో ఆదివారం శ్రీశ్రీశ్రీ చండీయజ్ఞ శ్రీమద్భగవద్గీతా యజ్ఞసహిత శ్రీసప్తప్రహరణ సంకీర్తన మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో హోమం తోపాటు ఉదయం ధ్వజారోహణం, నవగ్రహపూజ, చండీ హవనం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం విష్ణుసహస్రనామ పారాయణం, భగవద్గీత యజ్ఞం, ఆధ్యాత్మిక సందేశం, రాత్రి అఖండ భజనలు వంటి కార్యక్రమాలను నిర్వహించారు. తాజా మాజీ సర్పంచ్ బూర్ల సింధూజ, మండిగ రాయనర్సయ్య, సప్తప్రహరణ కమిటీ, శివరామ దేవస్థాన కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## అండర్–14 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్టు



అండర్-14 ఉమ్మడి కరీంనగర్ క్రికెట్ జట్టు

**రామగిరి:** ఈ నెల 26 నుంచి అండర్–14 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు మహబూబ్‌నగర్‌లోని జడ్చర్లలో జరగనున్నాయి. రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ స్టేట్ అండర్–14 క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి కరీంనగర్ జట్టు వెళ్లినట్లు రాష్ట్ర ఎస్‌జీఎఫ్ టీఎస్ సెక్రటరీ కె.రాంరెడ్డి, పెద్దపల్లి జిల్లా సెక్రటరీ శ్రీనివాస్ తెలిపారు. క్రికెట్ పోటీలు 29వరకు జరుగుతాయని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా నుంచి పల్లె సాక్షిత్‌రావు కెప్టెన్‌గా, ఎస్‌కే సాదిక్ వైస్ కెప్టెన్‌గా నియమితులయ్యారు.

## మాజీ ఎమ్మెల్యే దాసరి జన్మదిన వేడుకలు



పెద్దపల్లిరూరల్: కేక్ కట్ చేస్తున్న నాయకులు

**పెద్దపల్లిరూరల్:** పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. స్ఫూర్తి మానసిక దివ్యాంగులకు పండ్లు పంపిణీ చేశారు. జెండాకూడలిలో అన్నదానం చేశారు.

**సుల్తానాబాద్:** బీఆర్ఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పుట్టిన రోజుల వేడుకలు నిర్వహించారు.

**ఎలిగేడు:** మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు.

**కాల్వశ్రీరాంపూర్:** కాల్వశ్రీరాంపూర్ అంబేడ్కర్ చౌరస్తాలో జన్మదిన వేడుకలు జరుపుకున్నారు.

**జూలపల్లి:** మండల కేంద్రంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రఘువీర్‌సింగ్, పెద్దాపూర్‌లో బీఆర్ఎస్ నాయకులు స్వీట్లు పంపిణీ చేశారు.

**ఓదెల:** ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో ప్రత్యేకపూజలు చేశారు.